క్లుప్తంగా

అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, శంకరయ్యలకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించినట్లు వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ బుధవారం తెలిపారు. వారిని కళాశాల సిబ్బంది శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాగనిక, ప్రభాకర్, గంగారెడ్డి, సిద్ధు, వసంతలక్ష్మి తదితరులున్నారు.

తల్లిపాలు అమృతం



నిజాంసాగర్(జుక్కల్): పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామ ఒడ్డెర కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులు పౌష్టిక ఆహారం తీసుకుంటే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె చెప్పారు. ఆరోగ్య కార్యకర్త ప్రభాత, అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, రమా, ముక్తాబాయి తదితరులున్నారు.

ప్లేట్‌లెట్స్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

కామారెడ్డి అర్బన్: డెంగీ వ్యాధితో జిల్లాలో అనేక మంది పేదరోగులు బాధలు పడుతున్నా రూ.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ సెపరేషన్ యంత్రం వినియోగంలోకి తీసుకురావడం లేదని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాలు ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజా ధనం రూ.40 లక్షలతో తీసుకువచ్చిన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురానందున పేదరోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక మంది ప్లేట్‌లెట్స్ లభించక నిజామాబాద్ లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు 10 బెంచీల అందజేత



పిట్లం(జుక్కల్): తిమ్మానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం 10 బెంచీలను లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నారాయణ, రీజియన్ కో–ఆర్డినేటర్ మర్గల వేణు, కార్యదర్శి బాలు, కిషన్, హెచ్‌ఎం నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కిష్టయ్య



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి డివిజన్ రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆకుల కిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా నర్సింహారావు, తదితరులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

'ఆలయ అభివృద్ధికి నిధులు సాధించాలి'



కామారెడ్డి అర్బన్: స్థానిక శ్రీపంచముఖి హనుమాన్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి తొలి సమావేశం చైర్మన్ వైద్య కిషన్‌రావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఆలయ అభివృద్ధికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో కనీసం రూ.50 లక్షల నిధులు సాధించాలని చర్చించారు. ఆలయంలో ఇద్దరు అర్చకుల పోస్టులు ఖాళీగా ఉన్నందున భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. భక్తుల విశ్వాసం మేరకు ప్రతిరోజూ దర్శనం, పూజలు నిర్వహించాలని సభ్యులు అన్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్‌రావు, ధర్మకర్తలు కొత్త భీంరావ్, బొట్టు శ్రీనివాస్, రెడ్డి గంగామణి, గజవాడ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం





పిట్లంలోని పలు కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

- పిట్లంలో ఎక్కడి చెత్త అక్కడే
- స్వైర విహారం చేస్తున్న దోమలు
- విష జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. వార్డుల్లో దోమలు విపరీతంగా పెరిగి జనాలు జ్వరాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య లోపంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా అధికారులు హెచ్చరిస్తున్నా స్థానిక అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. పలు కాలనీలలో రోజూ చెత్త సేకరించే వాహనాలు రాకపోవడంతో కాలనీల్లో ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు చెత్తకుప్పలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని కాలనీ ప్రజలు అంటున్నారు. కాలనీల సమీపంలో గల ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరడంతో పాటు చెత్త కుప్పలతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల కారణంగా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు.

చెత్త సేకరించే వాహనాలు రావడం లేదు..

పంచాయతీ పరిధిలో చెత్త సేకరించే వాహనాలు కాలనీల్లోకి సరిగ్గా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పరిధిలో మూడు ట్రాక్టర్లు ఉన్నాయి. ఒక ట్రాక్టర్‌తో చికెన్ సెంటర్లు, హోటళ్లలో వ్యర్థాలను తీసుకెళ్తున్నారు. మిగితా రెండు ట్రాక్టర్లతో 16 వార్డుల్లో చెత్త సేకరించాల్సి ఉంది. ట్రాక్టర్లు రోజూ అన్ని వార్డుల్లో తిరగడం లేదు. దీంతో పలు వార్డులు చెత్తా చెదారంతో నిండిపోతున్నాయి. సేకరించిన చెత్తను సైతం డంపింగ్‌యార్డ్, కంపోస్ట్ షెడ్‌కు తరలించకుండా సాయిబాబ ఆలయం సమీపంలో రహదారి పక్కన వేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల కాలనీవాసులకు దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు



మా కాలనీలో చెత్త సేకరించే ట్రాక్టర్లు సరిగ్గా రాకపోవడంతో కాలనీలోని ఒక ప్రదేశంలో అందరూ చెత్తను వేస్తున్నారు. కాలనీ మధ్యలో చెత్త వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగాయి. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. జిల్లా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. – కొండ శ్రీనివాస్, పిట్లం

కాలువలు శుభ్రం చేయించాలి



మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు బెడద పెరుగుతోంది. రోడ్ల పక్కన చెత్తాచెదారం, గుంతల్లో నిలిచిన నీటితో కంపు కొడుతోంది. దీంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి పంచాయతీ పరిధిలో ఫాగింగ్ చేసి, కాలనీలలో పేరుకుపోయిన చెత్తను తరలించి దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లితే బాగుంటుంది. – అశోక్ రాజ్, పిట్లం

'అడవిని మొత్తం నాశనం చేశారు'



డీఎఫ్‌వో నిఖితకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన జేఏసీ నాయకులు

కామారెడ్డి క్రైం: బీసీలుగా ఉన్న లబానా లంబాడాలు తాము కూడా గిరిజనులమే అని చెప్పుకుంటూ అడవులను నాశనం చేశారని గాంధారి మండలానికి చెందిన గిరిజన జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై బుధవారం వారు జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి వచ్చి డీఎఫ్‌వో నిఖితకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన జేఏసీ నాయకుడు మోజీరాం నాయక్ మాట్లాడుతూ.. గాంధారి మండలంలో ఒకప్పుడు దట్టమైన అడవులు ఉండేవన్నారు. గిరిజనులమైన తాము అటవీ ప్రాంతాల్లో నివసిస్తూ పశువులు, మేకలను మేపుకొంటూ జీవనం సాగించేవారమన్నారు. బీసీ వర్గానికి చెందిన లబానాలు చాలా రోజులుగా అడవులను నరికివేస్తూ ఆక్రమించేస్తున్నారని ఆరోపించారు. లబానాలు ఆక్రమించిన అటవీ భూములను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్ గ్రామాన్ని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇంకా ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు ఏఎంసీ చైర్ పర్సన్ రజిత.. పాలకవర్గ సభ్యులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ అభివృద్ధికి 2 కోట్ల 35 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు తదితరులున్నారు.

ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలి

- ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి



గోలిలింగాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. గోలిలింగాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మొరం కొరత లేకుండా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులున్నారు.

జయశంకర్‌కు ఘన నివాళులు



డీపీవోలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ నరసింహారెడ్డి, అధికారులు



బాన్సువాడలో .. సబ్ కలెక్టర్ కిరణ్మయి



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..



జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో..

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. పెళ్లి చేసుకోకుండా తన జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారని గుర్తు చేశారు.



మద్నూర్ తహసీల్ కార్యాలయంలో..



ఎల్లారెడ్డి తహసీల్‌లో..



భిక్కనూరు: సౌత్ క్యాంపస్‌లో..



లింగంపేట బీజేపీ కార్యాలయంలో సుష్మాస్వరాజ్, జయశంకర్ చిత్రపటాలకు నివాళులు

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న సోషల్ వర్క్ విభాగాలను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల నుంచి రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సోషల్ వర్క్ అతిథి అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు బుధవారం జిల్లా కేంద్రంలో వినతి పత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులను శాశ్వత ప్రతిపాదికన తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. అతిథి అధ్యాపకులు రమేష్, సత్యం పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిలో చర్చి ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డిలో నూతనంగా నిర్మించిన చర్చిని ఏఎంసీ చైర్ పర్సన్ రజిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు. చర్చి ఫాదర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



కామారెడ్డి టౌన్: గాంధారి మండలం మాతుసంగెంలో ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సర్వేనంబర్ 119, 175లో 350 ఎకరాల ప్రభుత్వం భూమిలో 60 ఎకరాల భూమి గిరిజనులు, దళితులు సాగు చేస్తున్నారని తెలిపారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు పాస్‌బుక్ సృష్టించుకుని కబ్జాలకు యత్నిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోతిరాం నాయక్, నాయకులు ప్రకాష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై పశువులు



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్–బోధన్ ప్రధాన రహదారి సర్వీస్ రోడ్లు పశువులకు నిలయాలుగా మారుతున్నాయి. మహమ్మద్‌నగర్ మండలంలోని గిర్నితండా, కొనతండా, నడిమి తండాలు ప్రధాన రహదారి వెంట ఉన్నాయి. ఈ రహదారి విస్తరణ పనులు చేపడుతుండటంతో ఆయా తండాల్లో సర్వీస్ రోడ్లు వేశారు. కొత్తగా వేసిన సర్వీస్ రోడ్లపై తండా రైతులు పశువులను కట్టేసి కొట్టాలుగా ఉపయోగిస్తున్నారు. రోడ్లపైన పశువులను కట్టేస్తుండటంతో ప్రయాణానికి వీలు లేకుండా పోతుంది. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లపైన పశువులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చివేశారు



పాల్వంచలో గుంతలు పూడ్చేసిన తర్వాత రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో కమ్యూనిటీ బోరు పైపుల లీకేజీతో రోడ్డుపై గుంతలు ఏర్పడి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'ఇది రోడ్డా లేక గుంతల సముదాయమా' అనే శీర్షికన సాక్షిలో బుధవారం వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుంకు రవి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు.

వినియోగంలోకి నీటి ట్యాంకు


నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో నీటి ట్యాంకు నిరుపయోగంగా ఉందని మంగళవారం సాక్షిలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ అధికారిణి అశ్విని తన సిబ్బందితో మరమ్మతులు చేయించారు. నీటి ట్యాంకును అందుబాటులోకి తెచ్చారు.

పరిసరాలు శుభ్రం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్‌లో పారిశుద్ధ్య లోపం తీవ్రంగా ఉందనే విషయాన్ని సాక్షి దినపత్రికలో ఈ నెల 5న 'పారిశుద్ధ్యమా నీ జాడ ఎక్కడ.. అనే శీర్షిక ప్రచురితమైన వార్తకు మండల స్థాయి అధికారులు స్పందించారు. బుధవారం ఎంపీడీవో సంతోష్ కుమార్ గ్రామానికి చేరుకుని పరిసరాలను పరిశీలించి శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి రాధాకు సూచించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులో వ్యవసాయ బావుల వద్ద కాలిపోయిన



ట్రాన్స్‌ఫార్మర్ గురించి 15 రోజులుగా అధికారులు పట్టించుకోవడంలేదని విషయాన్ని సాక్షి దినపత్రికలో ఈ నెల 5న ట్రాన్స్ 'ఫార్మర్ల' కష్టాలు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పాత పద్ధతితో గ్రంథాలయ వేళలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లాలోని గ్రంథాలయాలలో సమయపాలన వేళలో మార్పులు చేర్పులు జరిగాయి. గ్రంథాయాల వేళలు మార్చాలి అనే శీర్షిక సాక్షి పేపరులో బుధవారం ప్రచురితమైంది. దీంతో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రాకాంత్‌రెడ్డి స్పందించి పాత పద్ధతిలోనే గ్రంథాలయాలను నడిపించాలని ఆదేశాలు జారీ చేశారు. పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

అడ్లూర్ హైస్కూల్‌కు మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు



సౌండ్‌సిస్టంను అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కామారెడ్డి అర్బన్/కామారెడ్డిటౌన్: పట్టణ పరిధిలోని అడ్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ మైక్ సెట్‌ను విరాళంగా అందజేసింది. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డి, ఎంఈవో ఎల్లయ్య, హెడ్‌మాస్టర్ సుమలత, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, ప్రతినిధులు ధనుంజయ్, బాలరాజు, సుధాకర్, నవీన్, దత్తాత్రి, సీఆర్‌పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

జప్తిజాన్కంపల్లి పాఠశాలకు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు సౌండ్ సిస్టంతోపాటు బ్యాండును విరాళంగా అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్తం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల కో–ఆర్డినేటర్ అట్టెం శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కిష్టాగౌడ్, యూత్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు హజీముద్దీన్, బాలరాజు, పోచయ్య, సాయిలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద, ఎల్లారెడ్డి, తాడ్వాయి ఐటీఐ, ఏటీసీల్లో ప్రవేశాలు

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని బిచ్కుంద, ఎల్లారెడ్డి, తాడ్వాయి ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లో ఈనెల 28 వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు వాకిన్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు జిల్లా కన్వీనర్ జి.ప్రమోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన వారు సంప్రదాయ ఐటీఐ కోర్సులతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలోని నైపుణ్య ఆధారిత కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని కన్వీనర్ వివరించారు. అన్ని ఒరిజనల్ ధ్రువ పత్రాలతో అందుబాటులోని ఐటీఐలను సంప్రదించాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహం విద్యార్థులకు ప్రభుత్వ వైద్యులు యెమిమా బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హాస్టల్ వార్డెన్ సునీత, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు ఉన్నారు.

85 మందికి కంటి పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వైద్యుడు రవీందర్ పటేల్ ఆధ్వర్యంలో 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి కామారెడ్డి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్ రైతు వేదికలో బుధవారం వ్యవసాయ అధికారులు, హిందుస్తాన్ యూని లీవర్ కంపెనీ ప్రతినిధులు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుందని, పండించిన ఉత్పత్తులు కంపెనీ వారు వచ్చి కొనుగోలు చేస్తారని తెలిపారు. సాగు చేసిన రైతులు అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. అధికారుల అన్ని విధాలా సూచనలు, సలహాలిస్తారని, ఆందోళన చెందవద్దని కోరారు. ఏఈవో ప్రశాంత్‌రెడ్డి, కంపెనీ సిబ్బంది వికాస్, రైతులు పాల్గొన్నారు.